



సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్

నేడే ప్రజాగళం

- క్రోసూరు, సత్తెనపల్లిలో సభలు
- చంద్రబాబు పర్యటనకు భారీ ఏర్పాట్లు
- నేడు టీడీపీలో చేరనున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నరసరావుపేట, క్రోసూరు, ఏప్రిల్ 5: ఎన్నికల శంఖారావం పూరించేందుకు శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పల్నాడులో అడుగుపెట్టనున్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాలో జరిగే ప్రజాగళం సభలు, రోడ్‌షోల్లో టీడీపీ అధినేత పాల్గొననున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు చంద్రబాబు పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పసుపు తోరణాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలతో చంద్రబాబు పర్యటన ప్రాంతాలను టీడీపీ నాయకులు అలంకరించారు. క్రోసూరు, సత్తెనపల్లిలో ప్రజాగళం బహిరంగ సభలకు ఏర్పాట్లు చేశారు. క్రోసూరు ఎన్టీఆర్ సెంటర్‌లో జరిగే సభ ఏర్పాట్లను పెదకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పర్యవేక్షిస్తున్నారు. క్రోసూరులోని పశువుల ఆస్పత్రి వెనుక ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ప్రధాన రహదారి వరకు చంద్రబాబు ప్రయాణించే వాహనం రావడానికి వీలుగా ప్రత్యేకంగా రోడ్డును నిర్మించారు. క్రోసూరులో సభ అనంతరం ఎర్రబాలెం, పీసపాడు, రెంటపాళ్ల వరకు మోటారు బైక్‌లతో ర్యాలీ ఉంటుందని భాష్యం ప్రవీణ్ తెలిపారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల నుంచి చంద్రబాబుకు ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో జరిగే ప్రజాగళం సభ ఏర్పాట్లను టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు. ప్రజాగళం విజయవంతంపై విస్తృత ప్రచారం చేశారు. సత్తెనపల్లిలోని 11, 12వ వార్డుల్లో తెలుగు మహిళలు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి మహిళలను ఆహ్వానించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తన అనుచరులతో కలిసి సత్తెనపల్లిలో జరిగే సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఆయన గురజాల నుంచి భారీ ర్యాలీగా సత్తెనపల్లికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయా సభలకు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ అభ్యర్థులు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, యరపతినేని శ్రీనివాసరావు, జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబులతో పాటు కోడెల శివరాం, జనసేన, బీజేపీ, టీడీపీ ముఖ్య నేతలు హాజరు కానున్నారు.



సభకు రావాలని మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు

ప్రజాగళం షెడ్యూల్..

చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి హెలికాప్టర్‌లో 2.55 గంటలకు క్రోసూరుకు చేరుకుంటారు. పశువుల ఆస్పత్రి సెంటర్‌లోని హెలిప్యాడ్ నుంచి 3.10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. 5.15 గంటలకు వేదిక నుంచి కారులో సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌కు 6 గంటలకు చేరుకుంటారు. అక్కడ సభలో ప్రసంగిస్తారు. అనంతరం రాత్రి బస కోసం వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో నియోజకవర్గాల వారీగా ఎన్నికల తీరుపై చంద్రబాబు సమీక్షించనున్నారు.

ఫై..డే



- భానుడి భగభగ
- 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- సాధారణం కన్నా 10 డిగ్రీలు అధికం
- ఉమ్మడి జిల్లా అంతటా సూర్య ప్రతాపం

ఉష్ణోగ్రత డిగ్రీలలో..

రెంటచింతల	45
మాచర్ల	45
వినుకొండ	45
గురజాల	45
దాచేపల్లి	45
నరసరావుపేట	44
పిడుగురాళ్ళ	44
వినుకొండ	43
సత్తెనపల్లి	43
చిలకలూరిపేట	43



నిర్మానుష్యంగా నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు

నరసరావుపేట, రెంటచింతల, ఏప్రిల్ 5: భానుడు భగభగలతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెల ఆరంభంలోనే 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే నెలను తలపించే రీతిలో ఎండలు ఉన్నాయి. 9 గంటల నుంచి వేడి తీవ్రత కనిపిస్తోంది. రానున్న వారం రోజులు ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇప్పుడే ఎండ తీవ్రత ఈ స్థాయిలో ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనల్లో ప్రజలున్నారు. ఎండ వేడిమి, ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చే సాహసం చేయడంలేదు. అత్యవసర పనులకు మాత్రమే బయటకు వస్తున్నారు. గత ఏడాది ఇదే రోజున 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణం కన్నా 10 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. రెంటచింతల, నరసరావుపేట ప్రాంతాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఎండకు పేరుగాంచిన రెంటచింతలలో శుక్రవారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 43.5 డిగ్రీలుగా నమోదైనట్లు జంగమహేశ్వరపురం వాతావరణ కేంద్రం పీటీవో భానుప్రసాద్ చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇదే ఎక్కువన్నారు. గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో ఎండ తీవ్రత ఎక్కువైంది. నిత్యం వందల మందితో కోలాహలంగా కనిపించే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రధాన రహదారులు ఉదయం పదిగంటలకే నిర్మానుష్యంగా మారాయి.

జాగ్రత్తలు అవసరం..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఎండలో బయటకు వెళ్లే వారు రక్షణగా గొడుగు వాడితే మంచిదంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకూడదని హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే ముక్కు, చెవులకు వస్త్రం చుట్టుకోవడం మంచిది. చిన్నారులు, వృద్ధులు అత్యవసర మైతే తప్ప బయటకు రావద్దని, క్షేత్రస్థాయిలో పనిచేసే వారు తగిన జాగ్రత్త పాటించాలని చెబుతున్నారు. నీటిని ఎక్కువగా తాగాలని, మజ్జిగ కొబ్బరి నీళ్ల పండ్ల రసాలు తీసు కోవాలని సూచిస్తున్నారు. ద్విచక్రవాహనంపై ఎక్కువ దూరం ప్రయాణించడం అంత మంచిది కాదని హెచ్చరిస్తున్నారు.



నిర్మానుష్యంగా రెంటచింతల ప్రధాన రహదారి

ఉపాధ్యాయ సంఘాల..

నేతలకు ఎర!



- ఓట్ల కోసం అధికార పార్టీ ఉపాధ్యాయులకు ఆత్మీయ గాలం
- ఆత్మీయ సమావేశాల పేరుతో భారీ నజరానాలు
- పల్నాడులో ఓ సంఘానికి 10 సెంట్ల స్థలం కేటాయింపు
- భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా అత్యున్నత అధికారి
- గుంటూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యే రూ. 5లక్షలు నిధులు
- సంఘం ముసుగులో ఎన్నికల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితా సేకరణ
- ఉపాధ్యాయుల సమాచారం అధికార పార్టీ గుప్పిట్లోకి..

గుంటూరు(విద్య), ఏప్రిల్5: ఇప్పటివరకు ఉపాధ్యాయుల్ని పూచికపుల్లతో సమానంగా చూసిన అధికార పార్టీ నేతలు ఓట్ల కోసం కొత్త నాటకం ప్రారంభించారు. రహస్యంగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తూ నజరానాలు, నోట్లతో ఎరవేస్తున్నారు. సంఘాలకు చెందిన ప్రధాన నాయకులకు ఇప్పటికే భారీమొత్తంలో ముట్టచెప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రోజు ఏదో ఒక చోట ఉపాధ్యాయులు, సంఘాల నేతలతో ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు ఆత్మీయ సమావేశాలు పెడుతున్నారు. మరోవైపు ఎన్నికల ముందే రహస్యంగా ఓ సంఘానికి 10 సెంట్ల స్థలం కేటాయించడం దీని భూమి పూజ కోసం జిల్లా అత్యున్నత అధికారి, ఎమ్మెల్యే రావడం, ఆ సంఘం ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాను అధికారపార్టీ నేతల చేతుల్లో పెట్టడం వంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో కలకలం సృష్టిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో దాదాపు ప్రభుత్వ, జడ్పీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు 16వేల మందికిపైగా ఉన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో ఉపాధ్యాయులకు ప్రభుత్వం చేసింది ఏమీ లేకపోగా యాప్‌ల పేరుతో నిత్యం వేధింపులకు గురిచేసింది. ఇప్పటికే సంఘాల నాయకులపై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికితోడు ముఖ్య కార్యదర్శి హోదాలో పాఠశాలల్లో ప్రవీణ్‌ప్రకాశ్ చేసిన హడావిడి, ఉపాధ్యాయులతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన తీరు తెలిసిందే. దీంతో ఉపాధ్యాయుల్లో దాదాపు 90శాతంపైగా ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈనేపథ్యంలో వారిని మంచి చేసుకునేందుకు పార్టీ నాయకులు రంగంలోకి దిగారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో సంఘాలకు చెందిన ప్రధాన నాయకులను ఎమ్మెల్యేలు కలవకుండా ద్వితీయ శ్రేణి నేతలతో రహస్యంగా ఫోన్‌లోనే టచ్‌లోకి వస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న కోపం స్థానికంగా మా మీద చూపవద్దని ఈసారి తమకే ఓట్లు వేయాలని ఎమ్మెల్యేల చేత సంఘాల నాయకులకు ఫోన్ చేయిస్తున్నారు. జిల్లాలో ఓ సంఘానికి ఓ ఎమ్మెల్యే అభ్యర్థి రూ.5లక్షల వరకు నిధులు సమకూర్చారు. ఈ సంఘానికి చెందిన రాష్ట్రస్థాయి మాజీ నేతకు ఈ మొత్తం అందినట్లు ప్రచారం సాగు తోంది. దీంతో గతంలో ప్రభుత్వంపై బహిరంగానే విరుచుకుపడే ఈ నేత ఇప్పుడు పెద్దగా స్పందించడం లేదు. ఈ సంఘం నాయకులు ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో టచ్‌లో ఉంటూ లక్షల్లో సంఘానికి నిధులు సమకూర్చేపనిలో ఉన్నారు. పల్నాడు జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందు ప్రభుత్వానికి చెందిన రూ.లక్షల విలువైన 10 సెంట్ల స్థలాన్ని ఎటువంటి ఉత్తర్వులు లేకుండా ఓ సంఘానికి కట్టబెట్టారు. పల్నాడులో విద్యాశాఖకు చెందిన ఉన్నత అధికారి ఒకరు ఎన్నికల సెల్ పేరుతో కార్యాలయంలో అనధికారికంగా ఓ విభాగం ప్రారంభించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాలు ఎప్పటికప్పుడు పార్టీ నాయకులకు చేరవేసే పనిలో ఆయన నిమగ్నమై ఉన్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాను కొన్ని సంఘాలు రహస్యంగా సేకరించినట్లు సమాచారం. దీనిని అధికారి పార్టీ నేతలకు చేరవేసి భారీ స్థాయిలో లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. బాపట్ల జిల్లాలో సైతం ఓ రెండు సంఘాలు అనధికారికంగా అధికార పార్టీ సేవలో తరిస్తున్నాయి.


గుంటూరు బరిలోకి.. మూడో కృష్ణుడు?



- లోక్‌సభ స్థానంలో పోటీకి వైసీపీ నేతలు వెనుకంజ
- కిలారి పోటీ చేయననడంతో అధిష్ఠానం పునరాలోచన
- పరిశీలనలో ఆళ్ల, మోదుగుల, కదిరి బాబురావుల పేర్లు
- టీడీపీ అభ్యర్థి పెమ్మసాని దూకుడుతో వైసీపీలో దడ
- ఎమ్మెల్యే రోశయ్యకు తిరిగి పొన్నూరే దక్కే అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ స్థానం బరిలో దిగేందుకు వైసీపీ నేతలు వెనుకంజ వేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఎన్ఆర్ఐ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దూకుడుతో వైసీపీ అభ్యర్థులు వణికి పోయి పరారవుతున్నారు. ఇప్పటికే ఉమ్మారెడ్డి వెంకటరమణ తన వల్ల కాదని చెప్పేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో రంగప్రవేశం చేసిన పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య కూడా బావ బాటే పట్టారు. దీంతో అయోమయానికి గురైన వైసీపీ అధిష్ఠానం అయోమయంలో పడి మూడో కృష్ణుడి కోసం అన్వేషణ మొదలుపెట్టినట్లు సమాచారం. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో సైతం గుంటూరు లోక్‌సభ స్థానాన్ని టీడీపీ దక్కించుకుంది. ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలు గెలుపొందినా కూడా ఆ పార్టీ తరపున బరిలోకి దిగిన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పరాజయం పాలయ్యారు. దీంతో ఈ ఎన్నికల్లో మొదట్లో ఆయన పేరు పరిగణనలోకి తీసుకోలేదు. కాపు సామాజికవర్గం అభ్యర్థిని బరిలోకి దించాలనే ఆలోచనతో తొలుత కేంద్ర మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తనయుడు వెంకటరమణను బరిలోకి దింపారు. ఇక్కడ పోటీ చేసి గెలవడం సాధ్యం కాదని భావించిన ఆయన వారం రోజుల్లోనే చెప్పా పెట్టకుండా హైదరాబాద్ వెళ్ళిపోయారు. ఈ పరిణామంతో అవాక్కైన వైసీపీ అధిష్ఠానం ఆయన బావ, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యను బలవంతంగా బరిలోకి దించింది. అయితే ఇంతవరకు ఆయన గుంటూరులో కార్యాలయాలన్ని ఏర్పాటు చేసుకోలేదు. మొక్కు బడిగా పొన్నూరు, గుంటూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థులతో ప్రచారంలో పాల్గొంటూ వచ్చారు. మరో వైపు టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని లోక్ సభ స్థానం పరిధిలో రెండో పర్యాయం కూడా పర్యటన ప్రారం భించారు. తొలి సారి ఎన్నికల బరిలోకి దిగినప్పటికీ వ్యూహాత్మకంగా అడు గులు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థులుగా బరిలోకి దిగుతున్న వారు ఓటమి భయంతో ఒక్కొక్కరుగా తప్పుకుంటు న్నారు. రెండు రోజుల క్రితం ప్ర... భుత్వ సలహాదారు సజ్జలను కలిసి తాను ఎంపీగా పోటీ చేయనని రోశయ్య చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆయన గుంటూరు పశ్చిమ, లేదా పొన్నూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరగా పశ్చిమ నుంచి ఎట్టి పరిస్థితుల్లో అవకాశం కల్పించలేమని సజ్జల చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే ముమ్మరంగా ప్రచారం చేస్తున్న మంత్రి విడదల రజినిని కదిలించే అవకాశం లేదని చెప్పారు. దీంతో ఇక పొన్నూరే ఆయనకు దక్కే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం బరిలో ఉన్న అంబటి మురళీ కూడా రోశయ్య సామాజికవర్గమే కావడంతో అధిష్ఠానానికి కొత్త సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి నెలకొంది. ఉగాది తర్వాత జరిగే మార్పుల్లో రోశయ్య పేరు కూడా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈలోగా గుంటూరు ఎంపీ అభ్యర్థిగా మూడో కృష్ణుడ్ని బరిలోకి దించేందుకు పలు పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. రెడ్డి సామాజికవర్గానికి ఇచ్చే పక్షంలో మంగళగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిల పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మోదుగులను అసెంబ్లీ బరిలోకి దించాలని ఆలోచన చేసిన అధిష్ఠానానికి వీలు కాలేదు. దీంతో ఆయన పేరును తాజాగా ఎంపీ అభ్యర్థిగా పరిశీలిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి మోదుగుల, రామకృష్ణారెడ్డిలు బంధువులు కావడంతో వీరిలో ఒకరికి అవకాశం కల్పించాలని అధిష్ఠానం యోచన చేస్తున్నట్లు సమాచారం. కాపు సామాజికవర్గానికే సీటు ఇవ్వాలనుకునే పక్షంలో ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పేరును పరిశీలి స్తున్నట్లు తెలిసింది.

గుంటూరు పశ్చిమం.. విభిన్నం



- సంపన్నులు, పేదలు సమ్మిళిత కేంద్రం
- ఎప్పుడూ విభిన్నంగానే ఎన్నికల ఫలితాలు
- వాణిజ్య రంగాన్ని విస్తరించిన మహామహుల గడ్డ

విద్యాకేంద్రం.. ప్రపంచస్థాయిలో వాణిజ్యం చేసే వ్యాపారవర్గాల సమాహారం.. సంపన్నులు, పేదలు సమ్మిళితంగా ఉన్న ప్రాంతం.. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం. గుంటూరు మిర్చి యార్డు, పొగాకు వ్యాపారాన్ని దేశ స్థాయిలో సమీక్షించే టుబాకో బోర్డు, ఐటీసీ వంటి ప్రముఖ సంస్థలు, కార్యాలయాలకు వేదిక. పొగాకు రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య రంగాన్ని విస్తరించిన మహామహుల గడ్డగా గుర్తింపు పొందింది. ఈ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ విభిన్నంగానే ఉంటాయి. ఇక్కడి ఓటర్లు ఎవరినీ నెత్తికెక్కించుకుని భారీ మెజారిటీలు ఇవ్వరు. ఎవరు గెలిచినా.. ఎవరు ఓడినా వ్యత్యాసం నామమాత్రమే. ఇక్కడి నుంచి గెలిచిన మహామహులు చట్టసభల్లో అడుగుపెట్టి గుంటూరు ప్రజల వాణిని ఘాటుగా వినిపిస్తారు. ప్రధానమైన కార్పొరేట్ విద్యాసంస్థలు, విశాలమైన రహదారులతో అందంగా ఉండే ప్రాంతం ఒక వైపు.. కనీస వసతులు లేని మురికి వాడలు మరోవైపు ఉన్నాయి.

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు 1952 తర్వాత జరిగిన పునర్విభజనలో రెండు నియోజకవర్గాలుగా మారింది. 2009 పునర్విభజనలో గుంటూరు - 2గా ఉన్న ఈ నియోజకవర్గం గుంటూరు పశ్చిమగా రూపాంతరం చెందింది. ఈ నియోజకవర్గంలో 1955 నుంచి 2019 వరకు 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆయా ఎన్నికల్లో ఐదు సార్లు టీడీపీ, 8 సార్లు కాంగ్రెస్, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. పొగాకు వ్యాపారంలో గుర్తింపు పొందిన చేబ్రోలు హనుమయ్య, చదలవాడ జయరాంబాబులు కాంగ్రెస్ నుంచి పోటీ చేసి మూడో విడత ఓడిపోయి హ్యాట్రిక్ మిస్ అయ్యారు. 1962, 67లో గెలుపొందిన చేబ్రోలు హనుమయ్య అంతకముం దు గుంటూరు మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేశారు. 1983లో టీడీపీ అవిర్భవించిన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన 9 ఎన్నికల్లో 9 మంది అభ్యర్థులు మారారు. పదో సారి జరిగే ఎన్నికలో కూడా కొత్త అభ్యర్థి గల్లా మాధవి బరిలోకి దిగనున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వలస ఓటర్లు ఇక్కడ అత్యధికం. ఈ నియోజకవర్గం నుంచి ముగ్గురు రాష్ట్ర మంత్రులుగా ఎంపికయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన దివంగత చేబ్రోలు హనుమయ్య, కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నుంచి డాక్టర్ శనక్కాయల అరుణ మంత్రులుగా పనిచేశారు. 1983లో గెలుపొందిన న్యాయవాది నిశ్శంకరరావు వెంకటరత్నం 1984-85లో అసెంబ్లీ స్పీకర్‌గా సేవలందించారు. ఇక్కడ గెలుపొందిన మేడూరి నాగేశ్వరరావు, నిశ్శంకరరావు వెంటకరత్నం, మోదుగుల వేణుగోపాలరెడ్డి ఎంపీలుగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన కన్నా లక్ష్మీనారాయణ గతంలో పెదకూరపాడు నుంచి, మేడూరి నాగేశ్వరరావు దుగ్గిరాల నుంచి, గాదే వీరాంజనేయ శర్మ సత్తెనపల్లి నుంచి అసెంబ్లీకి ప్రాతినిథ్యం వహించారు. 2009లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కన్నా ప్రస్తుతం సత్తెనపల్లి నుంచి టీడీపీ తరపున బరిలో ఉన్నారు. 2019లో రాష్ట్రమంతటా వైసీపీ గాలి వీస్తోన్నా తెలుగుదేశం అభ్యర్థి మద్దాళి గిరి గెలవడం విశేషం. 2024 ఎన్నికల్లో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండూ మహిళా అభ్యర్థులనే బరిలోకి దించడం రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. వైసీపీ అభ్యర్థిగా మంత్రి విడదల రజిని, టీడీపీ కూటమి అభ్యర్థిగా గల్లా మాధవి బరిలో ఉన్నారు.

వెంటాడే సమస్యలు

గుంటూరు నగర పరిధిలోని ఈ నియోజకవర్గాన్ని తాగునీటి సమస్య వెంటాడుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, రోడ్లపైకి మురుగు చేరి ప్రజలు అగచాట్లు పడడం ఇక్కడ సర్వసాధారణం. నగరంలోని సంపన్న వర్గాలు, వాణిజ్య కేంద్రా లు ఉండడం కారణంగా నియోజకవర్గంలో ఆక్రమణల పీడ ఎక్కువనే చెప్పాలి. లక్ష్మీపు రం, బృందావన్‌గార్డెన్స్, పట్టాభిపురంలలో ఆక్రమణల సమస్య మరింత ఎక్కువ. నగ రం ఎంత విస్తరించినా, అభివృద్ధి చెందినా ట్రా ఫిక్ సమస్య వెంటాడుతూనే ఉంది.

సామాజిక వర్గాల వారీగా (సుమారు)

కమ్మ	34,000
కాపు	29000
ముస్లిం	28000
బ్రాహ్మణ	28,000
మాల	29,000
మాదిగ	27,000
రెడ్డి	15,000
యాదవ	12000
వడ్డెర	10000
వైశ్య	16000
వెలమ	1000
క్షత్రియ	1000
క్రైస్తవులు	3000
గౌడ	3000
పద్మశాలీలు	3500
రజక	8000
నాయీబ్రాహ్మణ	3000
ముదిరాజ్	1500
కుమ్మరి	3000
ఉప్పర	2000
బోయ	1000
సూర్యబలిజ	2000
కృష్ణ బలిజ	2000
విశ్వబ్రాహ్మణ	2000
జంగం	500
బుడబుక్కల	500
ఇతరులు	11000

ఓటర్ల వివరాలు

మొత్తం	2,75,429
పురుషులు	1,33,876
మహిళలు	1,40,915
ట్రాన్స్‌జెండర్లు	47
సర్వీస్ ఓటర్లు	156
ఎన్ఆర్ఐలు	435

నియోజకవర్గ ముఖచిత్రం



నియోజకవర్గ చరిత్ర

సం.	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1955	మేడూరి నాగేశ్వరరావు	కాంగ్రెస్	బి.వీరయ్య	సీపీఐ	3,313
1962	చేబ్రోలు హనుమయ్య	కాంగ్రెస్	డీ.వై రామయ్య	సీపీఐ	331
1967	చేబ్రోలు హనుమయ్య	కాంగ్రెస్	కనపర్తి నాగయ్య	సీపీఐ	14,059
1972	నిశ్శంకరరావు వెంకటరత్నం	స్వతంత్రం	చేబ్రోలు హనుమయ్య	కాంగ్రెస్	2,763
1978	గాదె వీరాంజనేయశర్మ	కాంగ్రెస్	నిశ్శంకరరావు వెంకటరత్నం	జనతా	6,865
1983	నిశ్శంకరరావు వెంకటరత్నం	టీడీపీ	గాదె వీరాంజనేయశర్మ	కాంగ్రెస్	29,763
1985	చదలవాడ జయరాంబాబు	కాంగ్రెస్	గాదెదుర్గాప్రసంనాంబ	టీడీపీ	1,265
1989	చదలవాడ జయరాంబాబు	కాంగ్రెస్	కిలారు కోటేశ్వరరావు	టీడీపీ	20,974
1994	చల్లా వెంకటకృష్ణారెడ్డి	టీడీపీ	చదలవాడ జయరాంబాబు	కాంగ్రెస్	12,768
1999	డా.శనకాయల అరుణ	టీడీపీ	కె.ఈశ్వర భారతి	కాంగ్రెస్	6,314
2004	తాడిశెట్టి వెంకట్రావు	కాంగ్రెస్	డా.టీవీ రావు	టీడీపీ	15,304
2009	కన్నా లక్ష్మీనారాయణ	కాంగ్రెస్	చుక్కపల్లి రమేష్	టీడీపీ	3,301
2014	మోదుగుల వేణుగోపాలరెడ్డి	టీడీపీ	లేళ్ల అప్పిరెడ్డి	వైసీపీ	17,913
2019	మద్దాళి గిరిధర్	టీడీపీ	చంద్రగిరి ఏసురత్నం	వైసీపీ	4,289

వైసీపీకి సేవ చేస్తే.. భూమిని కాజేశారు

- తోటి వైసీపీ నేతలే బినామీ పేర్లతో ఆక్రమించారు
- ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని ఆశ్రయించినా న్యాయం జరగలేదు
- నడికూడి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పెద పిచ్చయ్య

6లో..

8న సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(శనివారం)
సహారీ (ఉదయం) 4.42 (ఆదివారం)


తుళ్లూరులో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి అభివృద్ధిని కాంక్షించేవారిని గెలిపించాలి

- విచ్ఛిన్నం చేసే వారిని ఇంటికి పంపాలి
- 1571వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్ 5: అమరావతి అభివృద్ధిని కాంక్షించేవారిని గెలిపించి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1571వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు, గృహాల నుంచి నిరసన దీక్షలు చేస్తున్న మహిళలు, రైతులు మాట్లాడుతూ, అమరావతి విచ్ఛిన్నం చేయాలనుకున్న వారిని ఇంటికి పంపాలని విజ్ఞప్తి చేశారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం అమరావతి అభివృద్ధి చెందితే యువతకు బంగారు భవిషత్ ఉండేదన్నారు. మూడు రాజధానలంటూ అమరావతిని నిర్వీర్యం చేసిన వైసీపీ పాలకులను శాశ్వతంగా ఇంటికి పరమితం చేయాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నేడు టీడీపీలోకి ఎమ్మెల్సీ జంగా

- వున్నంతో పాటు మరికొందరు


జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 5: వైసీపీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరనున్నారు. శనివారం సత్తెనపల్లిలో జరగనున్న ప్రజాగళం సభలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకోనున్నారు. జంగా కృష్ణమూర్తితో పాటు పిడుగురాళ్లకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ వున్నం నరసింహారావు, ఆయన తనయుడు డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, దాచేపల్లి మాజీ ఎంపీపీ భూషణం చెన్నయ్య, మాశెట్టి పుల్లారావుతో పాటు మరికొందరు నేతలు కూడా నేడు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. బీసీల్లో మంచి పట్టున్న జంగా కృష్ణమూర్తి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కోస్తా జిల్లాల్లోనూ ఆ ప్రభావం పడే అవకాశం వుంది. 1999 నుంచి 2019 వరకు చిరకాల ప్రత్యర్థులుగా వున్న గురజాల మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఎట్టకేలకు ఒకేతాటిపైకి రావడం ఇక్కడ హాట్ టాపిక్‌గా మారింది. 2024 ఎన్నికల్లో ఇరువురు తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం పాటుపడేందుకు ఒకే వేదికపైకి వచ్చారు. జంగా కొద్దిరోజుల క్రితమే టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

- కన్నా లక్ష్మీనారాయణ


నకరికల్లులో టీడీపీలో చేరిన వారితో కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

నకరికల్లు, ఏప్రిల్ 5: గోదావరి-పెన్నా నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటం, ఆంధ్రప్రదేశ్ రాజధానిని నిర్మించటం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి నకరికల్లు టీడీపీ కార్యాలయంలో నకరికల్లుకు చెందిన ఎస్సీ ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన వైసీపీలోని 225 కుటుంబాలు టీడీపీలో చేరారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పిఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ప్రజలంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించటానికి సంసిద్ధంగా ఉన్నారన్నారు. రాజధాని నిర్మాణం చేసి ఇక్కడే సంపదను సృష్టించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, పార్టీ పరిశీలకులు ముక్కపాటి రామచంద్రరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తిన శ్రీనివాసరావు, బీజేపీ నేతలు షేక్ మున్వర్‌బాజీ, పాలడుగు శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వెంకటరావు, ఢీకొండ మహానంది, కాసా సాంబయ్య, భవనాసి కిషోర్, దూదేకుల హుస్సేన్‌బీ, అట్లూరి పుల్లమ్మ పాల్గొన్నారు.

తాడిశెట్టి చేరికతో టీడీపీ మరింత బలోపేతం

- గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్
- టీడీపీ గెలుపునకు అహర్నిశలు పని చేస్తాం :తాడిశెట్టి మురళి
- పెమ్మసాని సారథ్యంలో భారీగా ర్యాలీతో తరలివెళ్లిన మురళి, ఆయన అనుచర గణం


లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాడిశెట్టి మురళి, అమల దంపతులు, పక్కన పెమ్మసాని

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5: తాడిశెట్టి సోదరుల చేరికతో జిల్లాలో టీడీపీ మరింత బలోపేతమైందని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నగర మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి, అమల దంపతులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్న సందర్భంగా స్థానిక ఆర్టీవో కార్యాలయం, శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన అభిమానుల ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడిశెట్టి మురళి మోహన్ టీడీపీలోకి రావడం శుభసూచకమన్నారు. మురళి రాకతో జిల్లాలో కూటమి గెలుపు తేలికైందన్నారు. శక్తివంతమైన తాడిశెట్టి సోదరులకు టీడీపీలో కీలకమైన బాధ్యతలను త్వరలోనే అప్పజెప్తామని హామీ ఇచ్చారు.

వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం: తాడిశెట్టి మురళి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను తీవ్రంగా మోసంచేసిన వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని తాడిశెట్టి మురళి స్పష్టం చేశారు. టీడీపీలోకి చేరే ముందు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి నేతి బీరకాయ చందంగా మారిందని విమర్శించారు. ఐదేళ్లలో అన్ని రంగాలను జగన్ నాశనం చేసారని విమర్శించారు. ముఖ్యంగా బీ సీలకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో వైసీపీలో కొనసాగానని, అక్కడ అటువంటి పరిస్థితులు లేవనే అందుకే అ పార్టీని వీడుతున్నట్టు వివరించారు. అమరావతి అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో ఒక్క పార్లమెంట్, ఏడు నియోజకవర్గాలను కూటమి క్లీన్ స్వీప్ చేయబోతున్నట్టు ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతున్నట్టు స్పష్టం చేశారు.

పెమ్మసాని సారథ్యంలో భారీగా ర్యాలీతో తరలివెళ్లిన తాడిశెట్టి మురళి

అంతకుముందు నగరంలో తాడిశెట్టి అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టాభిపురంలోని తాడిశెట్టి మురళి నివాసం నుంచి ఆర్టీవో కార్యాలయం, శిల్పారామం వరకు భారీవాహనాలతో వేలాదిమంది కార్యకర్తలతో ర్యాలీ జరిగింది. అనంతరం ఉండవల్లి, చంద్రబాబు నాయుడు ఇంటివరకు ఏర్పాటుచేసిన ర్యాలీని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. వేలాదిమంది కార్యకర్తలతో తాడిశెట్టి మురళి, దంపతులు తరలివెళ్లారు. తాడిశెట్టి మురళితో పాటు గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జీ కోవెలమూడి రవీంద్ర. తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అభ్యర్థులు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, టీడీపీ నేతలు రావిపాటి సాయి, చిట్టాబత్తిని చిట్టిబాబు, తాడిశెట్టి మిత్రులు సోమేపల్లి శివప్రసాద్, వక్కలగడ్డ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

యువనేత లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వారు వీరే....

తాడిశెట్టి కుటుంబీకులతో పాటు టీడీపీలో చేరినవారిలో కార్పొరేటర్ మల్లిబోయిన శ్రీవల్లి (52వ డివిజన్) మాజీ జడ్పీటీసీ భూపతి శ్రీనివాసరావు, జయరామ్ నాయుడు, మాజీ కార్పొరేటర్లు అడపా కాశీవిశ్వనాథం, సంబరాల వాసు, వంజరపు రత్నకుమారి, రేఖా ఉమామహేశ్వరి, ఇంకొల్లు శంకర్ రావు, రెడ్డిపాలెం సర్పంచ్ బుజ్జి (రెడ్డిపాలెం), మాజీ సర్పంచ్‌లు యర్రంశెట్టి వేణుగోపాల్, చింతా సుబ్బారావు, ఎలిమినేటి వెంకటేశ్వర్లు, మోడావత్ శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీలు మల్లెంపాటి శేషగిరిరావు, వేల్పూరి వెంకటస్వామి, వైసీపీ రాష్ట్ర నాయకులు చంగలశెట్టి సత్యనారాయణ, చింతల దేవి, సుబ్బారావు (రెడ్డిపాలెం), బీసీ నాయకులు, విన్నకోట శంకర్, విన్నకోట మధు, కొండెబోయిన శ్రీనివాసరావు, ఎస్టీ నాయకుడు పరసా కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు డైరక్టర్ తాళ్ల నాగరాజు, ప్రముఖ నాయకులు ఈదర సాయిప్రసాద్ చౌదరి, ఐలా శ్రీనివాసరావు (పాతగుంటూరు), మంగళగిరి చేనేత నాయకులు కానుగుల రవి, కాపు నాయకుడు నామాల శశిధర్, ఆర్యవైశ్య ప్రముఖులు వెచ్చా కృష్ణమూర్తి, నగర నాయకులు రెడ్డి వీరస్వామి తదితరులు ఉన్నారు.

వైసీపీకి సేవ చేస్తే.. భూమిని కాజేశారు

- తోటి వైసీపీ నేతలే బినామీ పేర్లతో ఆక్రమించారు
- ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని ఆశ్రయించినా న్యాయం జరగలేదు
- నడికూడి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పెద పిచ్చయ్య


పెద పిచ్చయ్య

గురజాలటౌన్, ఏప్రిల్ 5: వైసీపీ కోసం కష్టపడి పనిచేస్తే ఆ పార్టీవారే తన భూమిని కాజేశారని నడికుడి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తగుళ్ల పెద పిచ్చయ్య ఆరోపించారు. శుక్రవారం మండలంలోని తేలుకుట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో తనకున్న 4.40 ఎకరాల్లో 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నామన్నారు. పట్టాలు కోసం గురజాల తహసీల్దార్ వద్దకు వెళ్తే పొలం నీ పేరు మీద లేదని చెప్పారన్నారు. తన పొలం తోటి వైసీపీ నేతలే బినామీ పేర్లపై ఆన్‌లైన్‌లో మార్చుకున్నారని తెలుసుకొని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వద్దకు వెళ్లి తమ పొలం పట్టాలు ఇప్పించాలని కోరామన్నారు. అయితే తనకు న్యాయం జరుగలేదని, అందుకే తన పదవికి, పార్టీకి రాజీనామా చేశానన్నారు. ఇది సహించలేని కొందరు వ్యక్తులు తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని దక్కించుకోవడానికి చివరికి ఆర్డీవో కార్యాలయంలో రూ. 20 వేలు, తహసీల్దార్ కార్యాలయంలో రూ. 20 వేలను అక్కడి అధికారులకు ఇచ్చానన్నారు. అయినా ఫలితం రాలేదన్నారు. ఇక ఉన్నతాధికారులను ఆశ్రయించడమే నయం అని ఫిర్యాదు చేయనున్నట్లు పెదపిచ్చయ్య చెప్పారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

- కనుమరుగవుతున్న పంట కాల్వల గట్లు
- ఎన్నికల విధుల్లో అధికారులు
- చెలరేగిపోతున్న అక్రమార్కులు


చింతలపూడి పంటపొలాల్లో పంట కాల్వ మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్


ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పొన్నూరుటౌన్, ఏప్రిల్5: పొన్నూరు మండలంలో అక్రమ మట్టి తవ్వకందారులు అధికారపార్టీ అండతో చెలరేగిపోతున్నారు. మండల అధికారులు, ఎన్నికల విధుల్లో ఉండటంతో అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండలంలోని చింతలపూడి గ్రామంలో కొతివానిపాలెం గ్రామ రహదారిలో పంట కాల్వల గట్లను అనుమతులు లేకుండా తవి తరలించుకుపోయి విక్రయించుకుంటున్నారు. అలాగే వడ్డిముక్కల గ్రామంలో నాలుగైదు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా మట్టి రవాణా సాగుతోంది. పంట పొలాల్లో మెరకవేసిన మట్టి తొలగిస్తున్నామని చెప్పి పంట కాల్వ గట్లను తవ్వకొని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు కూడా ఎన్నికల విధులతోపాటు గ్రామాలో మట్టితవ్వకందారులపై నిఘా వేయాలన్ని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి కన్నుమూత


భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రామాంజనేయులు, ఇన్‌సెట్లో సీతామహాలక్ష్మి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 5: వట్టిచెరుకూరు మండల మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి(64) అనారోగ్యంతో గత కొంతకాలంగా చికిత్స పొందుతూ శుక్రవారం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆమె మరణంతో మండలంలోని ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె భౌతికకాయాన్ని పుల్లడిగుంటలోని స్వగృహానికి తీసుకొచ్చారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సీతామహాలక్ష్మి 2014లో టీడీపీ తరపు న వట్టిచెరుకూరు మండల జడ్పీటీసీగా గెలుపొందారు. గ్రామంలో ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ తన వద్దకు ఎలాంటి సహాయం కోసం వచ్చినా లేదనకుండా, తన వంతు సహకారాన్ని అందిస్తూ చెరగని ముద్ర వేసుకున్నారు. అందుకే ఆమెను అంతా అమ్మ అని ఆప్యాయంగా పిలుస్తారు. తన కుమారుడు ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి ప్రోత్సాహం, తోటి ఎన్ఆర్ఐల సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప్పుటూరి చినరాములు సేవాట్రస్ట్ పేరుతో వాటర్‌కూలర్లు అందించారు. ఏటా రైతులకు విత్తనాలు, యంత్ర పరికరాలు అందజేస్తున్నారు. పది పరీక్షల సమయంలో మండలంలోని స్కూళ్ళలో పరీక్ష సామాగ్రితో పాటు మజ్జిగప్యాకెట్లు అందించారు. వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లోని పలు స్కూళ్ళలో చిన్నారులకు బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలు అందించి తమ ఉదారతను చాటుకు న్నారు. సీతామహాలక్ష్మి మరణవార్త తెలిసిన వెంటనే ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, జనసేన ప్రత్తిపాడు నియోజ కవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వ రరావు, పలువురు నాయకులు శుక్రవారం పుల్లడిగుంటలోని ఆమె స్వగృహానికి చేరుకొని ఆమె భౌతికకాయా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె భర్త చిన రాము లు, కుమారుడు, ఎన్ఆర్ఐ రామ్‌చౌదరి, ఇతర కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. సీతామహాలక్ష్మి భౌతికకాయానికి శనివారం ఉదయం 11 గంటల ప్రాం తంలో స్థానిక శ్మశానవాటి కలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు వెల్లడించారు.

8న సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్, ఏప్రిల్ 5: వేసవి దృష్ట్యా ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ఈనెల 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నాగార్జున సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ కుడి కాలువ ద్వారా 5500 క్యూసెక్కుల చొప్పున ఈ నెల 18వ తేదీ వరకు నీటిని విడుదల చేయాలని ఉత్తర్వులిచ్చారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని అధికారులు తమ పరిధిలోని 461 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నీటితో నింపుకోవాలని ఉత్తర్వుల్లో తెలిపారు.

హైవేపై అదుపుతప్పిన మినీ బస్సు

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 5: స్పైసెస్ పార్కుకు ఉద్యోగులతో వెళుతున్న మినీ బస్సు అదుపు తప్పిన ఘటన మండలంలోని తుమ్మలపాలెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నుంచి యడ్లపాడు వద్ద స్పైసెస్ పార్కుకు మినీ బస్సు 12మంది ఉద్యోగులతో వెళుతోంది. అయితే డ్రైవర్ వేగంగా బస్సు నడపటంతో తుమ్మలపాలెం వద్ద బస్సు అదుపుతప్పింది. దీంతో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఐరన్ ఫెన్సింగ్‌ను బస్సు గుద్దుకుంటూ సర్వీసు రోడ్డు పక్కనే ఉన్న రెయిన్ వాటర్ డ్రైనేజీలో పడింది. ఒక్కసారిగా బస్సు అదుపుతప్పడంతో బస్సు వెనుక కూర్చున్న గుంటూరు రూరల్ మండలం నల్లపాడు గ్రామానికి చెందిన కరణం శేషసాయి కుమార్(28) అక్కడికక్కడే మరణించాడు. మరో నలుగురికి గాయాలు అయ్యాయి. వీరిని వెంటనే గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అదుపు తప్పి కాలువలో కూరుకుపోయిన మినీ బస్సు

రాష్ట్ర పోలీసు చెక్‌పోస్టు తనిఖీ

దాచేపల్లి, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పల్నాడు జిల్లాలోకి ఎటువంటి అక్రమ మద్యం, పరిమితికి మించిన నగదు సరఫరా కాకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని నూతనంగా పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బిందుమాధవ్ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల అంతరాష్ట్ర పోలీసు చెక్‌పోస్టును ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ సమయంలో ఏమైనా వాహనాలు, వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే మీ పై అధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ బాల నాగిరెడ్డి, ఎస్ఐ శివ నాగరాజు, తదితరులున్నారు.


పొందుగల రాష్ట్ర పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాదవ్

ప్రభావశీల నేత బాబు జగ్జీవన్‌రామ్

- జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో డాక్టర్ పెమ్మసాని


జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెమ్మసాని

గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అణగారినవర్గాల పట్ల వున్న వ్యత్యాసాలు, అడ్డంకులను లెక్కచేయకుండా తన గళాన్ని బలంగా వినిపించిన నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ అని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా గుంటూరులోని పట్టాభిపురం, మార్కెట్ సెంటర్లలోని ఆయన విగ్రహాలకు పెమ్మసాని, గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అత్యంత ప్రభావంతమైన నాయకుల్లో జగజ్జీవన్ రామ్ ఒకరని, ఆయన నాయకత్వ పటిమను స్ఫూర్తిగా తీసుకొని నాయకులు ఎదగాలని తెలిపారు. రామాంజనేయులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. గళ్లా మాధవి మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం బాబు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. మద్దిరాల మ్యానీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటాన్ని ఈ వైసీపీ ప్రభుత్వం ఒకసారి గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్


వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్

అమృతలూరు, ఏప్రిల్ 5: రాజకీయపార్టీల ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినప్పటికి వాటి అమలులో వలంటీర్లు నిర్లక్ష్యం చూపుతున్నారు. అమృతలూరు 6వ వార్డులో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మీ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆమె వెంట ఇదే వార్డుకు చెందిన వలంటీర్ నూతక్కి పద్మశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిపై అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వేటు

సత్తెనపల్లి, ఏప్రిల్ 5: ఎన్నికల కోడ్ ఉల్లంఘన నేపథ్యంలో సత్తెనపల్లి మండలం పాకాలపాడుకు చెందిన వలంటీర్లు బి.స్వాతి, ఈపూరి కృష్ణారెడ్డిలను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో జగదీష్ తెలిపారు. కట్టావారిపాలెంలో ఉపాధి హామి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిరావును సస్పెండ్ చేసినట్టు ఏపీవో వెంకటనారాయణ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తూ వైసీపీ ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొనటంతో చర్యలు తీసుకున్నట్టు వారు తెలిపారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీ నేతకు చెంపదెబ్బ

కర్లపాలెం, ఏప్రిల్ 5: ప్రచారంలో ఉండగా వైసీపీ నేతను ఓ మహిళ చెంపదెబ్బ కొట్టిన ఘటన గురువారం రాత్రి యాదవపాలెంలో జరిగింది. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం పంచాయతీ యాదవపాలెంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న మండల ఉపాధ్యక్షుడు పందరబోయన సుబ్బారావును ఎలికా నాగలక్ష్మి చెంపదెబ్బ కొట్టింది. దీంతో ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నేతలు అవాక్కయ్యారు. సుబ్బారావు స్థలం విషయంలో తమకు అన్యాయం చేశాడని, తనపై అక్రమసంబంధం ఆరోపణలు చేశాడని ఆమె ఆరోపించింది. ఆ మహిళపై సుబ్బారావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేశామని ఎస్ఐ జనార్ధన్‌తెలిపారు.

మైనారిటీల అభ్యున్నతికి టీడీపీ కృషి

- డాక్టర్ చదలవాడ అరవిందబాబు


ఇఫ్తార్‌లో పాల్గొన్న లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పట్టణంలోని రావిపాడు రోడ్డులో ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నరసరావుపేట పట్టణంతో పాటు జిల్లా నలుమూలల నుంచి ముస్లింలు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల సింహాద్రి యాదవ్, జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, రావెల జ్ఞాని, గొట్టిపాటి చౌదరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

18 నెలల పసిపాప మృతి

- భర్తపై ఫిర్యాదు చేసిన భార్య


పాప తల్లి శ్రావణి

కారంపూడి, ఏప్రిల్ 5: మండలంలోని పేటసన్నిగండ్లలో గత నెల 31వ తేదీ రాత్రి 18 నెలల పసిపాప మృతిచెందింది. అయితే భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం వైద్యులు ఆ చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పేటసన్నిగండ్లకు చెందిన మన్నెం మహేష్‌కు ఈపూరు మండలం బొమ్మరాజుపల్లెకు చెందిన శ్రావణితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 18 నెలల పాప అక్షయ సంతానం. కాగా గత నెల 31వ తేదీన అక్షయ ముక్కు నుంచి రక్తం కారుతూ విగతజీవిగా మారింది. గమనించిన తల్లిదండ్రులు ఆ పాపను కారంపూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మరుసటి రోజు ఈనెల 1వ తేదీన పాపను ఖననం చేశారు. అయితే తన కుమార్తె మరణం పట్ల తన భర్తపై అనుమానం ఉందని శ్రావణి కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శుక్రవారం గుంటూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు గ్రామానికి చేరుకొని ఖననం చేసిన అక్షయ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. మృతికి గల కారణాలు కొద్ది రోజుల్లో తెలుస్తాయని సీఐ చిన మల్లయ్య తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00



పట్టాభిపురంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెమ్మసాని, గల్లా మాధవి

బాబు జగ్జీవన్‌రామ్ పోరాటం స్ఫూర్తిదాయకం

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, పేద, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్‌రామ్ తన జీవితాన్ని అంకితం చేశారని గుంటూరు పశ్చిమ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా 35వ డివిజన్ పట్టాభిపురం మెయిన్‌రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలసి మాధవి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాకోబు, మార్క్, మ్యానీ, ఈరెంటి వర ప్రసాద్, నవమి పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి కార్యాలయంలో భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, టీడీపీ నేతలు నివాళులర్పించారు.

మహిళలకు పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీ

గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మహిళలకు పెద్దపీట వేసింది ఎన్టీఆర్, ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీనేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి అసెంబ్లీ అభ్యర్థి గల్లా మాధవి తెలిపారు. గుంటూరు 21వ డివిజన్ రెల్లి సామాజికవర్గానికి చెందిన 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సూపర్ సిక్స్, మహాశక్తి ద్వారా అనేకమంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపే బృహత్కర కార్యక్రమానికి చంద్రబాబు కంకణం కట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో చిన్న మస్తాన్ వలి, కసుకుర్తి హనుమంత రావు, సింహాద్రి కనకాచారి,సువార్త, సరస్వతి, సత్య, నాగ లక్ష్మి, రాణి, కార్తిక్ పాల్గొన్నారు

ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తా

ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తామని గల్లా మాధవి హామీ ఇచ్చారు. 39వ డివిజన్ గుజ్జనగుండ్లలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం మహిళలకు మాధవి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో రుస్తుం బాబు, సింగంశెట్టి వీరయ్య, గార్డెన్స్ శ్రీకాంత్, వల్లంశెట్టి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి : డేగల



డేగల ప్రభాకర్

గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ అధినేత ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం జగన పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, ఎక్కడా ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. వైసీపీ చెబు తున్న కల్లిబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కేవలం బటన్లు నొక్కుతున్నారు తప్ప దాని వల్ల లబ్ధిదారులకు వచ్చిందేమీ లేదన్నారు. పథకాలను ఇలా ఇచ్చి, అలా పన్నుల రూపంలో తిరిగి వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం అభివృద్ధి కావాలంటే చంద్రబాబుతో నే సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని ప్రజలు ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని, ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. కూల్చివేతలు, కుట్రలు, కేసులు, కక్షసాధింపులతో ఐదేళ్ల జగన్ పాలన సాగిందన్నారు.

ఎన్నికల వేళ నగదు, టీ షర్టులు స్వాధీనం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 5 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి నిర్వహించిన తనిఖీలలో నగదు, టీ షర్ట్‌లు స్వాధీనం చేసుకున్నారు. తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.50,300 నగదు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఒక కారు, 28 టీ షర్టులు విలువ రూ.5,02,800లను సీజ్ చేశారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రూ. 1,94,71,000ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేయటం జరిగిందన్నారు.

గుంటూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా జంగాల

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5: ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేరు ప్రతిపాదించినట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ళ మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఎం, ఆమ్ ఆద్మీ, ఇండియా కూటమి పార్టీలు బలపరిచిన సీపీఐ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీపీఐ నాయకులు కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, సత్యనారాయణ, వలీ పాల్గొన్ని జంగాలను అభినందించారు.

గొప్ప సమతా వాది డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 5 : డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప సమతావాది, సంఘ సంస్కర్త అని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దాదాపు 40 ఏళ్లపాటు వివిధ కేంద్ర మంత్రి పదవులు నిర్వహించారని, కేంద్ర వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవాన్ని సహకారం చేసి భారత ఆహార గిడ్డంగులను ఏర్పాటుకు కృషి చేశారన్నారు. సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ ఆయన గొప్ప సామాజికవేత్త అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పి.రోజా, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదన్ రావు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి వీరాచారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, హార్టికల్చర్ ఉపసంచాలకులు రవీంద్రరావు, లీగల్ సెల్ పర్యవేక్షకులు లక్ష్మయ్య, ఏఎస్‌డబ్ల్యూ ఓ చెంచులక్ష్మి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భవాని, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, సోషల్ వెల్ఫేర్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

● గుంటూరు, ఏప్రిల్ 5 : బాబు జగ్జీవన్‌రామ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని, ఆయన అనుసరించిన ఆదర్శాలు, ఆయన చూపిన సంస్కరణ మార్గంలో నడవాలని ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, ఎస్‌బీ డీఎస్పీ పోతురాజు, సీఐ వెంకట్రావు, డీసీఆర్‌బీ సీఐలు చంద్రశేఖర్, వెంకట ప్రసాద్, మౌలాషరీఫ్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● గుంటూరు(విద్య), ఏప్రిల్ 5 : విద్యాశాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీఈవో పి.శైలజ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శైలజ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా విధులు నిర్వహించారని, దళితుల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి బలిరామ్, వెంకటరెడ్డి, ఉర్దూ డీఐ ఖాసిం, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, ఎస్‌టీయూ పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఘంటా కిరణ్, శ్రీహరి, నరేశ్, గైడ్స్ కెప్టెన్ కామాక్షి పాల్గొన్నారు. స్థానిక కంకరగుంటలోని ఎస్టీయూ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పెదబాబు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5 : నవ సమాజ నిర్మాణానికై అహర్నిశలు పోరాడిని చైతన్యమూర్తి బాబు జగ్జీవన్‌రామ్ అని బీజేపీ నాయకులు కొనియాడారు. శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక మార్కెట్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పదవులకు వన్నె తెచ్చిన బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేస్తామన్నారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, తూర్పు, పశ్చిమ నియోజవర్గ నాయకులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ శనక్కాయల రాజాకుమారి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబంలో జన్మించి తండ్రి స్ఫూర్తితో అహింసాతత్వాన్ని పుణికి పుచ్చుకొని, మహాత్మాగాంధీతో కలసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ అని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుల వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి, సమసమాజ స్థాపన కొరకు పాటు పడ్డారన్నారు. కార్యక్రమంలో గుడిమెట్ల దయారత్నం, పప్పుల దేవదాస్, బొల్లెద్దుల సుశీలరావు, తలతోటి సురేంద్ర, ఇత్తడి రత్నకుమారి, దాసరి జ్యోతి, పుల్లా సుందరంబాబు, దామచర్ల శ్రీనివాసరావు, బొబ్బిలి రామారావు, మేళం సైదయ్య, వేములకొండ శ్రీనివాస్, మల్లె ఈశ్వరరావు, ఉప్పుటూరి పేరయ్య, కె.యం.ఇ హుస్సేన్, ఇత్తడి పున్నారావు, పాటిబండ్ల బలరాం, కూనంనేని వెంకటరమణ, కోకా బాలాజీ, తిరువళ్ళూరి పద్మావతి, మన్నవ కోటేశ్వరరావు, భవిరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

● గుంటూరు, ఏప్రిల్ 5: కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా దేశంలో హరిత విప్లవానికి సారథ్యం వహించిన ఘనత బాబూ జగ్జీవన్ రామ్‌దేనని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, వైసీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని అన్నారు. చంద్రమౌళినగర్‌లోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజని, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, కిలారి రోశయ్య పలువురు నేతలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, కార్పొరేటర్లు, డివిజన్ల పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● మాజీ ఉప ప్రధాని దివంగత బాబుజగ్జీవన్‌రామ్‌కు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, ఎన్ ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా పలువురు నాయకులు హిందూ కళాశాల సెంటర్‌లోనున్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అలానే మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ పలువురు నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. నల్లపాడురోడ్డులోని ఏపీ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు పలువురు నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లె ఈశ్వరరావు, కొల్లూరు హనుమంతరావు, ద్వారకా శ్రీనివాస్, రాజు, సూరిబాబు తదితరులున్నారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్, కళాశాల పాలకవర్గ సభ్యులు డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, చుక్కపల్లి రమేష్ తదితరులు

ఫార్మసీ రంగంలో ఉన్నత అవకాశాలు

● ఘనంగా చిప్స్ కళాశాల 19వ వార్షిక వేడుకలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 5: యువ ఫార్మసీ నిపుణుల ఔషధ రంగంలో పరిశోధనలపై దృష్టి సారించాలని కార్పొరేట్ అఫైర్స్, సీఎస్‌ఆర్ అండ్ డీఎస్ఐఆర్ ఉపాధ్యక్షులు పి.రవి కుమార్ విజ్ఞప్తి చేశారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్(చిప్స్)లో శుక్రవారం జరిగిన 19వ వార్షిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మట్లాడారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పి.రవికుమార్ మాట్లాడుతూ ఆటోమేషన్, రోబోటిక్ టెక్నాలజీతో ఫార్మా రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ కె.మధుబాబు, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివప్రభోద్ తదితరులు హాజరై మాట్లాడారు. తొలుత కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ కోశాధికారి డాక్టర్ రాయపాటి గోపాలకృష్ణ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పయనీర్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి రమేష్, జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, ఆర్వీఆర్ బీఈడీ కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య, కేఎల్ఎఫ్ స్కూల్ కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకున్నాయి.

జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ సుభాని రాజీనామా

గుంటూరు, ఏప్రిల్ 5: వక్ఫ్‌బోర్డు జిల్లా జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న షేక్ సుభాని రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీలోని పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ వైసీపీలో ఎస్సీ, మైనార్టీ ఓటు బ్యాంకుని వాడుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వారిపై ఈ ప్రభుత్వంలో దాడులు ఎక్కువయ్యాయని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి, అతని పీఏ మధు కొంతమంది వ్యక్తులచే తనపై దాడి చేయించడం జరిగిందని ఆరోపించారు. వారిపై అధికారులకు, వైసీపీలో ఉన్న నాయకులకు సాక్ష్యాలతో సహా తెలిపినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మాభిమానం కలిగిన తాను వైసీపీకి రాజీనామా చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అందరూ కలిసికట్టుగా ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. తాను ఏ రాజకీయ పక్షంలో చేరాలన్నది త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు.

జడ్పీ డిప్యూటీ సీఈవోను ఎన్నికల విధుల నుంచి తప్పించాలి

● మహాజన సోషలిస్టు పార్టీ అధికార ప్రతినిధి మందా

గుంటూరు సిటీ, ఏప్రిల్ 5 : గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావును ఎన్నికల విధుల నుంచి వెంటనే తప్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ అధికార ప్రతినిధి మందా ప్రేమానందం శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. మూడేళ్ళుగా మోహన్‌రావు ఇదే పోస్టులో పనిచేస్తున్నారని, ఆయన ఇదే జిల్లాకు చెందిన వారన్నారు. అధికార వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని ఆరోపించారు. తన కింద పనిచేసే సిబ్బందిని కూడా వైసీపీకి అనుకూలంగా పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మాట వినని ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆయనను వెంటనే విధుల నుండి తొలగించకపోతే ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగవని అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ప్రేమానందం తెలిపారు.

శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రెస్ జగన్‌రెడ్డి : మన్నవ

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పింఛన్లపై ముఖ్యమంత్రి జగన్ రాజకీయం చేస్తూ వృద్ధుల, దివ్యాంగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శవ రాజకీయాలు చేయడం జగన్‌కు అలవాటుగా మారిందని, పింఛన్లపై వైసీపీ కుట్ర రాజకీయాలు చేస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓడిపోతాడని తెలుసుకొని పింఛన్ల వ్యవహారాన్ని రాజకీయంగా వాడుకుంటూ వృద్ధులను చంపి ఆ నేరాన్ని తెలుగుదేశం పార్టీపై వేయాలని సీఎం జగన్ కుట్ర పన్నాడన్నారు. పింఛను డబ్బులు లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ఏప్రిల్ 2న ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాలకు పూర్తిగా విరుద్ధంగా పింఛన్లు సచివాలయాలకే వచ్చి తీసుకోవాలని తిరిగి ఆదేశాలు జారీ చేయడం వెనుక భారీ కుట్ర దాగుందన్నారు. వైసీపీ శవ రాజకీయాలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్, ధనుంజయరెడ్డి శశిభూషణ్‌లు సహకారం అందించారని ఆరోపించారు. మే 13వ తేదీ జగన్ రెడ్డి పాపాలు పండే రోజుని, ఆ రోజుతో రాష్ట్రానికి పట్టిన పీడ వదిలిపోతుందని చెప్పారు. చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇంటి వద్దకే అందిస్తారని మోహనకృష్ణ హామీ ఇచ్చారు.

బీసీల ప్రాణాలు తీస్తున్న జగన్‌ను తరిమేస్తాం : వేములకొండ

గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బీసీల ప్రాణాలు తీస్తున్న జగన్ రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమికొడతామని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ హెచ్చరించారు. వైసీపీ భూదాహానికి కడపలో బలైన మరో బీసీ వ్యక్తి హత్యను నిరసిస్తూ టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హిందూ కాలేజీ సెంటర్లోని జ్యోతిరావు పూలె విగ్రహం వద్ద నిరసన తెలిపి ఆయన విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీకలుకోసి, ఆత్మహత్యలతో బలి తీసుకోవడమే బీసీ ఉద్ధరణా? అంటూ నిలదీశారు. జగన్ రెడ్డి తాత రాజా రెడ్డి దగ్గర నుంచి ఇప్పటి వరకూ బీసీల ప్రాణాలు తీయడమే లక్ష్యంగా జగన్‌రెడ్డి, ఆయన కుటుంబం వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి బీసీ బిడ్డ జగన్ రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమికొట్టి, చంద్రబాబును గెలిపించుకోవడానికి సిద్ధమయ్యారని చెప్పారు. కార్యక్రమంలో నేతలు మాదాల చిన్న కొండలరావు, గట్టి శ్రీనివాసరావు, గిరి గణేష్, బెళ్ళ వెంకటేశ్వరరావు, తుమ్మెటి మురళి, ఆరాధ్యుల వెంకటరమణ, మొఖరాల రాము, మారం కిషోర్, దేవేళ్ళ మల్లికార్జున్, ఈగ వీరయ్య, జంపని నాగేశ్వరరావు, మేకపోతుల సోమశేఖర్, గాలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న నకిలీ కాస్మటాలజీ సెంటర్లు

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 5: ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే నకిలీ కాస్మటాలజీ, హెయిర్‌కేర్ సెంటర్లు, లేజర్ సెంటర్లు, ట్రైక్రాలజీ సెంటర్లు, పార్లర్లు ఇటీవల కాలంలో జిల్లావ్యాప్తంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనిరీయాలజిస్ట్స్, లెప్రాలజిస్ట్స్ (ఐఏ డీవీఎల్) రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అత్తోట కవిత, డాక్టర్ జే.సౌజన్య ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 6వ తేదీ చర్మ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని ప్రజా ప్రయోజనార్థం వారు శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. కాస్మటాలజీ కేంద్రాలు నిర్వహించాలంటే నిపుణులైన చర్మవ్యాధి వైద్యనిపుణులు ఉండాలని, కాని ఎంబీబీఎస్ డిగ్రీ కూడా లేని వారు నిర్వహిస్తున్నారని తెలిపారు.



మహోదయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, సత్యవాణి తదితరులు

మహోదయం.. ఒక మహా సమాధానం : సత్యవాణి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5: ఒక కులం పేరు చెప్పి విషప్రచారాలు చేస్తూ, అణగదొక్కాలని చూస్తూ, చేస్తున్న దాడులకి మహోదయం ఒక మహా సమాధానం అవుతుందని సామాజిక విశ్లేషకులు, భారతీయం గొట్టిపాటి సత్యవాణి అన్నారు. స్థానిక గుంటూరు, బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం శతాధిక గ్రంథకర్త డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ రచించిన మహోదయం చారిత్రక నవల ఆవిష్కరణ సభ జరిగింది. సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీమంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సత్యవాణి మాట్లాడుతూ కమ్మ వారి దైవభక్తి, దేశభక్తి, ప్రజానురక్తి, వారి ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక, సాహిత్య దీప్తి మహోదయంతో వెల్లడి కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది కమ్మ చరిత్ర కాదని దక్షిణ భారత చరిత్ర అని గొప్ప మహదాశయంతో ముదిగొండ శివప్రసాదు అందించిన సాహిత్య శిఖరం అని ఆమె కొనియాడారు. వడ్డే శోభనాదీశ్వరరావు మాట్లాడుతూ ఏకాత్మక స్తోత్రంలో మునునూరు నాయకుల గొప్పతనాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ అభినందనీయులని కొనియాడారు. డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ మాట్లాడుతూ ఈ నవలను పరిచేయం చేస్తూ 2023, మే 21న ఏబీఎన్ ఛానల్‌లో ఓపెన్ విత్ ఆర్కే నిర్వహించిన ఆ సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణకు, ప్రచురణకై అండగా నిలబడిన గొట్టిపాటి సత్యవాణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముదిగొండ శివప్రసాద్‌ను నిర్వాహకులు, అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, పారిశ్రామిక వేత్తలు చల్లా రాజేంద్రప్రసాద్, సామినేని కోటేశ్వరరావు, ఎం.రామకృష్ణప్రసాద్, సాహితీవేత్త డాక్టర్ బీరం సుందరరావు, ఆలయ కమిటి కార్యదర్శి ఉమామహేశ్వరరావు, విద్యావేత్త తిరుపతయ్య ప్రసంగించారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

● మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 5: స్వతంత్ర్య సమరయోధుడు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ స్వతంత్ర్య సమరయోధుడిగా దేశం కోసం పోరాడారన్నారు. ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● జగ్జీవన్‌రామ్ కమిటీ, బీజేఆర్ యూత్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ 119వ జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. రేపల్లె బస్టాండ్ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి జక్క రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి.

● **కొల్లివర:** మండలంలోని వల్లభాపురం, మున్నంగి గ్రామాల్లో దళితవాడల్లో ఏర్పాటుచేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండల కేంద్రం కొల్లివర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి విద్యుత్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ డీఈఈ కె.రాజశేఖర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, ఎస్టీ, ఎస్సీల రిజర్వేషన్ల కోసం జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్, సబ్‌ఇంజనీర్ సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **తెనాలి అర్బన్:** మాజీ ఉప ప్రధాని దివంగత జగజ్జీవన్‌రామ్ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్టేషన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి శుక్రవారం సినీ దర్శకుడు దిలీప్‌రాజా, జగ్జీవన్‌రామ్ బయోపిక్ పాత్రధారి ప్రసాద్‌లు నివాళులర్పించారు. అనంతరం పేదలకు నగదు సాయం అందజేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెంచుపేటలో రాష్ట్ర కార్యదర్శి కిషోర్ మాదిగ, కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, సోపాటి కిరణ్, చిలకా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నరేంద్రకుమార్, మార్కండేయ బాబు తదితరులు

దాడికి పాల్పడిన వారిని పోలీసులే రక్షిస్తున్నారు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ

తెనాలి రూరల్, ఏప్రిల్ 5: కొల్లిపర మండలం మున్నంగిలో ట్రాక్టర్‌తో తొక్కించి, కత్తులతో దాడిచేసిన నిందితులను అరెస్టుచేసి బాధితులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు నిందితులకు రక్షణగా నిలుస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో వైసీపీకి చెందిన వ్యక్తుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వేమూరి బాలరాజును ధర్మారావు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ చూస్తుండగానే ట్రాక్టర్‌తో తొక్కించి, కత్తులతో బాలరాజుపై దాడిచేస్తే హత్యాయత్నం కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాల్సిన పోలీసులు సెక్షన్ 324కింద ఎలా కేసునమోదు చేస్తారని ప్రశ్నించారు. కేసులో నిందితులు అధికార పార్టీకి చెందిన ఆరగ అరుంధతిరెడ్డి, మల్లికార్జున రెడ్డిలకు ఎస్ఐ రవీంద్రరెడ్డి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్నంగి గ్రామ సంఘపెద్దలు, పలువురు ఎమ్మార్పీఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి: ఉమాకాంత్

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 5: పట్టణ ప్రజలను ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ కోరారు. స్థానిక సుల్తానాబాద్ సచివాలయం పరిధిలోని వడ్డెర కాలనీలో శుక్రవారం మలేరియా సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ తమ సిబ్బందితో ఇంటింటిని సందర్శించి, అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ వారంలో ఒకటి లేదా రెండుసార్లు నీటి నిల్వలను తొలగించడం వలన దోమ సంతతి అభివృద్ధి చెందకుండా చూడవచ్చన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధుల లక్షణాలను వివరించారు. అనంతరం ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో యూఎల్‌బీ విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరావు, ఆరోగ్య కార్యకర్తలు షేక్ నవీద్, షేక్ రషీద్, ఆరోగ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

పేదల సొంత ఇంటి కల సాకారం చేసిన టీడీపీ

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



వార్డులో మహిళలతో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 5: టిడ్కో ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు సొంత ఇంటి కలను తెలుగుదేశం ప్రభుత్వం సాకారం చేస్తే వాటిని లబ్ధిదారులకు అందించకుండా జగన్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని 2, 3వార్డులో శుక్రవారం కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ, భవిష్యతుకు గ్యారంటీ, సూపర్ 6 కరపత్రాలను పంచిపెట్టారు. ఇంటింటికి వెళ్లిన నరేంద్ర కుమార్ స్థానికులను కలుసుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు నరేంద్రకుమార్‌ను కలుసుకొని తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో టిడ్కో అపార్ట్‌మెంట్లను నిర్మించి పేదలకు ఇళ్లు మంజూరు చేశారన్నారు. కానీ ఐదేళ్లుగా ఆ ఇళ్లను తమకు అందించకపోవటం వల్ల అద్దె గృహాల్లోనే జీవనం సాగిస్తున్నామన్నారు. ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయకపోవటం వల్ల రుణాలు మంజూరు కాలేదని దీంతో తమకు సొంత ఇంటి కల తీరలేదన్నారు. అలాగే పెన్షన్ల కోసం సచివాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా తమ మొర ఆలకించేవారే లేరన్నారు. కరెంటు బిల్లులు అధికంగా వచ్చాయని సొంత ఇళ్లు ఉందని పెన్షన్లు తొలగించారని వాపోయారు. సొంత ఇళ్లు ఉందనే కారణంతో రేషన్ కార్డులు తొలగించటం వల్ల తమ పిల్లలకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు కూడా వర్తించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు చార్జీలభారం పెరిగిపోయి బిల్లులు చెల్లించలేని దుస్థితికి వచ్చామన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవటానికి రుణాలు ఇప్పించాలని కోరారు. ప్రధానంగా వార్డులో రెండు రోజులకు ఒకసారి తాగునీరు వస్తున్నాయని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. తాగునీటికి కొరత ఏర్పడటంతో రూ.20 క్యాన్ కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ మహిళలు తెలిపిన సమస్యల తీవ్రత అధికంగా ఉందన్నారు. ప్రజా సమస్యలు పాలకులకు పట్టకపోవటం విచారకరమన్నారు. రానున్న కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారమే కాకుండా మహిళలకు మేలు జరిగేలా అనేక కార్యక్రమాలను రూపొందించిన్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి అన్ని విధాలుగా పాటుపడతాం

● జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 5: ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి అన్ని విధాలుగా పాటుబడతానని జనసేన పీఏసీ చైర్మన్, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని చెంచుపేటలో ఎస్‌కే షైక్‌జానీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌కు నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదే విధంగా పట్టణంలోని బోస్‌రోడ్డులో టీడీపీ మైనార్టీ నాయకులు జిలాన్‌ఖాన్, ఫజల్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొని ముస్లిం, మైనార్టీ సోదరులకు ఆహారం వడ్డించి పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ముస్లిం, మైనార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెంచుపేటలో ముస్లింలకు ఇఫ్తార్ అందిస్తున్న నాదెండ్ల మనోహర్

మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్: ధూళిపాళ్ళ

చేబ్రోలు, పెదకాకాని, ఏప్రిల్ 5:పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లింలకు అందించే ఇఫ్తార్ మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం చేబ్రోలు మండలం వేజండ్లలో జరిగిన ఇఫ్తార్ విందులో నరేంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన నరేంద్ర కుమార్‌కు గ్రామ ముస్లింలు ఆత్మీయ ఆహ్వానం పలికారు. ముస్లిం సంప్రదాయలను అనుసరిస్తూ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. మత గురువుల ఆశీర్వచనాలు అందుకొని ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు ఇఫ్తార్‌ను వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



పెదకాకానిలో ముస్లింలకు ఇఫ్తార్ వడ్డిస్తున్న నరేంద్ర కుమార్

పెదకాకానిలో....

పెదకాకాని గ్రామంలోని పాతూరు బొడ్డురాయి సెంటర్‌లో శుక్రవారం ముస్లింలు ఇఫ్తార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లింలతో పాటు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్ణప్రజ్ఞాచారికి సత్కారం

తెనాలి రూరల్, ఏప్రిల్ 5: ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన మద్రాసు విశ్వవిద్యాలయంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా నిర్వహించి కవి సమ్మేళనంలో తాను పాల్గొని ప్రశంసాపత్రం పొందటం సంతోషంగా ఉందని కొలకలూరుకు చెందిన నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిర్వహించి కవి సమ్మేళనంలో నూతక్కి ప్రజ్ఞాచారి పాల్గొని తెలుగు ఘనత శీర్షిక పేరుతో పద్యపఠనం చేశారు. ఈ పద్యపఠనం పలువురి ప్రశంసలు అందుకుంది. కవి సమ్మేళనంలో పద్యపఠనం అనంతరం ప్రజ్ఞాచారిని ముఖ్య అతిథి, సినీగేయ రచయిత భువనచంద్ర మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు విస్తాలి సంకరరావు, పాండు రంగకాళియప్ప, నిడమర్తి వసుంధరాదేవి తదితర సాహితీప్రముఖులు పూర్ణ ప్రజ్ఞాచారిని దుశ్శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందించారు.

వసతికై దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5: గోరంట్లలోని శ్రీషిర్డీ సాయి ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనాధ, వృద్ధాశ్రమంలో రానున్న విద్యా సంవత్సరంలో వసతి కల్పించడానికి వృద్ధులు, విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమితి పరిపాలన అధ్యక్షుడు ఓరుగంటి విశ్వనాధం తెలిపారు. ఇతర వివరాలకై 9493447444, 9848116584 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సమితి సభ్యులు సమయవంతుల శ్రీధర్, వల్లి, సుజాత, వైకే శర్మ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.